ప్రజాశక్తి

ఆదివారం 11 మే 2025   8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

గ్రామాల్లో దాహం కేకలు

- ముంచుకొస్తున్న నీటి సమస్య
- 8 మండలాల్లో పడిపోయిన నీటి వనరులు
- ట్యాంకర్ల నీరే దిక్కు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

వేసవితాపం పెరుగుతోంది. గ్రామాల్లో ప్రజలు దాహం దాహం అంటున్నారు. గుక్కెడు నీటికోసం నానాపాట్లు పడుత˘న్నారు. ట్యాంకర్ల వస్తేనే నీళ్ల దొరికే గ్రామాల్లో పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ట్యాంకర్లతో లక్షమందికిపైగా జనాభాకు రోజూ మంచినీటిని అందిస్తున్నారు. ట్యాంకరు లేకుంటే తాగడానికి నీళ్లలేవు. డబ్బాలు కొనుక్కోవాలి. బోర్లలో ఉన్ననీటిని ట్యాంకర్లతో తీసుకుపోయి గ్రామాల్లో పోస్తున్నారు. ఇళ్లముందు బిందెలు ,పెద్దపెద్ద డబ్బాలు పెట్టుకుని ప్రజలు వేచిఉంటున్నారు. ఎప్పుడు ట్యాంకరు వస్తే అప్పుడు పట్టుకుని వినియోగించు కుంటున్నారు. దొనకొండ, దోర్నాల, పెదారవీడు, కొనకొనమిట్ల, మార్కాపురం, పుల్లలచెరువు, వైపాలెం మండలాల్లో సుమారు 25 గ్రామాల్లో ఇపుడు ట్యాంకర్లతో 1,00,415 మంది జనాభాకు నీటిని అందిస్తున్నారు.108 ట్యాంకర్లతో రోజుకు 595 ట్రిప్పులు నీరు సరఫరా చేస్తున్నారు. ప్రతిగ్రామానికి అవసరాన్ని బట్టి రెండు నుంచీ ఐదు టిప్పుల నీటిని పంపుతున్నారు.గ్రామాల్లో అన్ని రకాల బావులు బోర్లు ఎండిపోయాయి.తాగడానికి నీళ్లలేవు. జనాభాకే కాకుండా పశువులకూ నీళ్ళు లేవు. అన్ని రకాల అవసరాలకు ట్యాంకర్లతోనే నీటిని అందిస్తున్నారు. ఇప్పటికీ శాశ్వత తాగునీటి పథకాలు పూర్తికాలేదు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే 15 లక్షల మంది జనాభాకు తాగునీటిని అందించవచ్చు.దీనికోసం మూడు ▶ 2లో

బర్లీ పొగాకు కొనే వారేరీ..?

- పేరుకుపోయిన నిల్వలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- కౌలు రైతుల పరిస్థితి దుర్భరం

పొలాల్లో ఆరబెట్టిన బర్లీ పొగాకు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల్లో ఆత్మస్థైర్యం సన్నగిల్లుతోంది. చేతికి అందిన పంటను కొనేవారు లేక పొలం, ఇంటి ముందు నిల్వ చేసిన పొగాకు మండెలు రైతలను నిద్రకు దూరం చేస్తున్నాయి. మూడు నెలలుగా రైతులు ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేసినా బర్లీ పొగాకు కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వ్యవసాయం కోసం తెచ్చిన అప్పులు వారిని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో అర్థం కాక ధైర్యాన్ని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో రైతులకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మొన్న పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన రైతు ఉప్పుటూరి సాంబశివరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిన్న ఇంకొల్లు మండలం దుద్దుకూరుకు చెందిన బిల్లా సాంసన్ అనే రైతు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి చావుబతుకుల మధ్య కొట్టాడుతున్నాడు. వీరిద్దరూ కౌలు రైతులే.

గత ఏడాది రైతులు సాగు చేసిన ఏ పంటకు తగిన మద్దతు ధర లభించలేదు. ఒకప్పుడు రైతుల పాలిట తెల్లబంగారంగా మారిన పత్తి పంట పత్తి పంట చీడపీడలను తట్టుకోలేక పోవడంతో భారీగా నష్టాలు వచ్చాయి. దీంతో రైతులు పత్తిని సాగు చేయడం లేదు. అధిక పెట్టుబడులు పెట్టి మిర్చి సాగు చేస్తున్నారు. గత రెండేళ్ల తెగుళ్ల కారణంగా మిర్చి పంట కూడా దెబ్బతినడంతో రైతులు నష్ట పోతున్నాయి. గతేడాది వైట్‌బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులకు మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా బర్లీ పొగాకు సాగు బాగుంటుందని ఆశ పడి సాగు చేశారు. ఇతర పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడం, దిగుబడులు కూడా ▶ 2లో

తెల్లారిన 'కూలి' బతుకులు ▶ 3లో

కురిచేడులో ప్రభుత్వ భూమి కబ్జా ▶ 3లో

పొగాకు రైతు ఆత్మహత్యా యత్నం ▶ 6లో

లేబర్ కోడ్స్‌తో ఉద్యోగులకూ ముప్పే

- కనీస హక్కులు కోల్పోయే ప్రమాదం
- 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్ కుమార్

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

లేబర్ కోడ్స్‌తో కార్మికులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకూ ముప్పు పొంచి ఉందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. అజయ్‌కుమార్ తెలిపారు. లేబర్ కోడ్‌ల రద్దు –ఉద్యోగ కార్మిక, కర్షక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు , సంయుక్త కిసాన్ మోర్చా ,వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎల్ బిజి భవన్ లో శనివారం సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా .అజయ్‌కుమార్ మాట్లా డుతూ మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు యావత్ ప్రజానీకం సంక్షోభం ఎదుర్కొంటున్న వైనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారంతా సమ్మెలో పాల్గొనేలా చూడాలన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఒకసారి కార్మిక చట్టాలను మార్పు చేస్తే ప్రభుత్వ రంగంలో కూడా అమలు చేసే ప్రమాదం ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనీ, కనీస పెన్షన్ 9వేలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. మోహన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజలను ప్రశ్నించే హక్కు లేకుండా అణచి వేస్తుందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 15 లోపు అన్ని మండలాలలో సదస్సులు నిర్వహించ ాలన్నారు. సమ్మెను విజయవంతం ▶ 2లో

ప్రతి ఇంటి నుంచి

పారిశ్రామిక వేత్తే ధ్యేయం : కలెక్టర్

శంకుస్థాపనలో కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బాపట్ల మండలం కొండబొట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాల సమీపంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ(ఎంఎస్ఎంఇఎఫ్ఎఫ్ సి) కాంప్లెక్స్ నిర్మాణానికి కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకొనే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న పరిశ్రమల కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటగా బాపట్లలో 4.5 ఎకరాల్లో పార్క్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఈ పార్క్‌కు రూ.12 కోట్ల నిధులు మంజూర య్యాయన్నారు. రెండు నుంచి మూడు అంతస్తులు ఉండేలా 80 గదులు నిర్మిస్తు న్నామన్నారు. ఇందులో 30 గోదాములు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎఫ్ఎఫ్‌సి (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్)లో ఉత్పత్తుల తయారీ దారులకు అన్ని సదు పాయాలు కల్పి స్తామన్నారు. పొదుపు మహిళలు, యువతీ, యువకులు ఎవరైనా ఉత్పత్తులు తయారు చేసుకొనేందుకు మందుకు వస్తే వారికి గదులు కేటా యిస్తామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ యువతి,యువకులనుఔత్సాహిక ▶ 2లో

మొదటి గురువు.. తల్లి

ఘనంగా 'తల్లికి వందనం'

ప్రజాశక్తి-మార్కాపురం

మొదటి గురువు తల్లి మాత్రమేనని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం బుజ్జి చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని విజయాటాకీస్, మక్కా మసీద్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన తల్లికి వందనంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి గురువు తల్లి అని, ఆమె విలువ, కష్టం చిన్న తనం నుంచి తెలియజేయడం కోసం తల్లికి వందనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం తల్లులకు చిన్నారులచే వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాతృత్వానికి గౌరవం, సన్మానం అందించేందుకు ఏర్పాటైన ఈ కార్యక్రమం తల్లుల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ పద్మజ మాట్లాడుతూ తల్లి ఒక కుటుంబానికి, సమాజానికి మూలస్తంభం. ఆమె ఆరోగ్యం బాగుంటేనే పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తల్లుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలల ఆరోగ్యానికి పూర్తిస్థాయి సహాయం అందుతోంది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మహిళల్లో మాతృత్వపరంగా ఉన్న విలువలు మరింతగా వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. తల్లులకు ప్రత్యేకంగా సన్మానాలు అందించారు. వారి సేవల్ని గుర్తిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల చేత వారి తల్లులకు వందనం చేయించారు. పోషకాహార సమాచారాన్ని, శిశు సంరక్షణ సూచనలను వివరించారు. కళా ప్రదర్శనలు, పాటలు, మాతృభావాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇలాంటి గౌరవాన్ని పొందడం తమ జీవితంలో మరపురాని మధుర జ్ఞాపకం అని పలువురు తల్లులు భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి పద్మావతి, ఎం విజయలక్ష్మి, రామకుమారి, రామ సుబ్బమ్మ, షేక్ నసీమాలతో పాటు యర్రగొండపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

మార్కాపురం, యర్రగొండపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బర్లీ పొగాకు కొనేవారేరీ..?

(మొదటిపేజీ తరువాయి)

తగ్గడంతో రైతులు ఆశతో విస్తారంగా బర్లీ పొగాకు సాగు చేశారు.కౌలు ధరలు, సాగు ఖర్చులు పెరిగినప్పటికీ కొద్దిపాటి ఆదాయమైన వస్తుందనే ఆశలో బర్లీ సాగు చేశారు. సొంత పొలం లేని రైతులు కూడా ఎకరానికి రూ.30 నుంచి 40వేల వరకూ కౌలు చెల్లించి పొగాకును సాగు చేశారు. జిల్లాలో సాధారణ పొగాకు సాగు విస్తీర్ణం 17 వేల ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 70 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో 96 వేల ఎకరాల్లో బర్లీ సాగు చేశారు.అయితే ఈ ఏడాది దిగుబడి తగ్గింది. కొనుగోలు కూడా లేదు. గత సంవత్సరం మొదటి విరుపు అడుగు ఆకు సైతం క్వింటా రూ 8 నుంచి రూ 10 వేలకు కొన్నారు. రెండో వలుపు, మూడో వలుపు పొగాకును రూ.15 వేల నుంచి రూ 18 వేలకు కొన్నారు ఈఏడాది క్వింటా రూ.10 వేలకు కూడా కొనే పరిస్థితి లేదు. మార్చి నుంచే పొగాకు ఆకు కొట్టడం ముమ్మరం అయింది. కొనుగోళ్ళు మాత్రం లేవు.జిల్లా లోని ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌కు పొగాకు రైతులు తమ సమస్య గురించి మొర పెట్టుకున్నారు.ఏప్రిల్ ఒకటిన జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి బర్లీ పొగాకు రైతుల సమస్యను తీసుకెళ్ళారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పొగాకు కంపెనీల వారితో సమావేశం ఏర్పాటు చేసి బర్లీ కొనాలని చెప్పారు. గత వారం రాష్ట వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి వచ్చారు. పొగాకు రైతులతో సమావేశమయ్యారు. అదే రోజు వీరన్నపాలెంలో పొగాకు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైతులు అధైర్యపడొద్దని, ఓపిక పట్టాలని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. అవసరమైతే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి బర్లీ పొగాకు కొంటామని చెప్పారు. అది ఆచరణకు నోచలేదు. ఈ పరిస్థితులలో కంపెనీలు బర్లీ పొగాకును గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

లేబర్ కోడ్స్‌తో ఉద్యోగులకూ ముప్పే

(మొదటిపేజీ తరువాయి)

చేయుటకు అన్ని కార్మిక ఉద్యోగ సంఘాలు కలిసి రావాలని తీర్మానం చేశారు. ఎఐ టియుసి రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ లేబర్ కోట్స్ వల్ల యూనియన్ పెట్టుకునే సౌకర్యం కోల్పోతామన్నారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలపై మోడీ యుద్ధం కొనసాగించి నంతవరకు ప్రభుత్వంపై కార్మికులు కర్షకులు యుద్ధం చేపట్టాలని పిలుపునిచ్చారు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలస్తానే మరో రెండు చట్టాలు తెచ్చిందని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, ఐఎఫ్ఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల హనుమంతరావు,ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంజఅయ్యప్ప రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి జిజశ్రీనివాసులు నగర కార్యదర్శి టిజమహేష్ ఎఐబిఇఎ నాయకుడు రాజేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య , ఎఐటియుసి జిల్లా నాయకుడు సలార్, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాజేశ్వరరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు జివి. రాగయ్య, మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకుడు సిహెచ్.చిరంజీవి,ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు బి. వెంకటరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కొర్నెపాటి శ్రీనివాసరావు ,రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరిలో..

ఒక్కరికి మాత్రమే పదవి పదిలం!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో రాజకీయ మార్పులు వేగంగా జరిగిపోతున్నాయి. అవిశ్వాసం దిశగా అధికార పార్టీ అడుగులు వేసింది. మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణపై అవిశ్వాసానికి అంతా సిద్ధమైంది. ఒకటి రెండు రోజుల్లో అవిశ్వాసాన్ని కోరుతూ అధికారులకు అధికార పార్టీ నేతలు నోటీసు అందజేయనున్న విషయం తెలిసిందే. తాజాగా మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాసం ఉంటుందా లేదా అనే చర్చ మొదలైంది.

షేక్ ఇస్మాయిల్, ఒకటో వైస్ ఛైర్మన్

త్వరలో జరగబోయే అవిశ్వాసం తీర్మానం మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ వరకేనా? వైస్ ఛైర్మన్‌లపై కూడా ఉంటుందా అనే విషయంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలో వైస్ ఛైర్మన్‌లుగా షేక్ ఇస్మాయిల్, చాతరాజుపల్లి అంజమ్మ కొనసాగుతున్నారు. వారిద్దరూ వైసిపి నుంచి ఎన్నికైనవారే. ఆ వైస్ ఛైర్మన్‌ల పదవులపై కూడా టిడిపిలో చర్చ జరుగుతోందని తెలిసింది. వైస్ ఛైర్మన్‌లలో ఒకరు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటున్నారు కదా అనే చర్చ కూడా జరిగినట్లు తెలిసింది. వైస్ ఛైర్మన్‌లలో ఒకరు ఛైర్మన్ చిర్లంచెర్లపై అక్కసుతో లేదా ఇతర కారణాలు ఏమైనా కావచ్చు కానీ.. టిడిపి పెట్టబోయే అవిశ్వాసానికి సంతకం చేశారనే ప్రచారం జరుగుతోంది. అనుకూలంగా ఉన్న వైస్ ఛైర్మన్‌పై అవిశ్వాసం ఉండకపోవచ్చని తెలిసింది. మరో వైస్ ఛైర్మన్‌పై మాత్రం అవిశ్వాసం పెట్టే ఆలోచనలో అధికారపార్టీ నేతలు ఉన్నట్లు సమాచారం. అవిశ్వాసానికి అవసరమైన కౌన్సిల్ బలాన్ని టిడిపి కూడగట్టుకున్న సంగతి తెలిసిందే. ఒకరిద్దరు కౌన్సిలర్లు అవసరమైనా వైసిపిలో ఉండి టిడిపి పెట్టబోయే అవిశ్వాసానికి మద్దతు తెలిపేలా వైసిపి కౌన్సిలర్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు వైస్ ఛైర్మన్‌లలో ఒకరి పదవి మాత్రం పదిలమేనని, మరొకరి పదవి విషయంలో ఏమైనా జరగవచ్చనే చర్చ సాగుతోంది.

చాతరాజుపల్లి అంజమ్మ
రెండో వైస్ ఛైర్‌పర్సన్

ప్రతి ఇంటి నుంచి

పారిశ్రామికవేత్తే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామిక వేత్తలనుగా మార్చేందుకు ప్రభుత్వం దడ సంకల్పంతో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఎంతగానో సహక స్తున్నాయన్నారు. రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేలా గోదాములు నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిన్నచిన్న ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సహకరిస్తున్న విషయాలను ప్రజలు గుర్తించాలన్నారు. బాపట్ల పట్టణ అభివద్ధి సంస్థ ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు దొరుకు తాయన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల గ్లోరియా, ఎపిఐఐసి గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై.రామకష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు..

(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలుగా ఎదురు చూడాల్సిన పరిస్థితి.ఇప్పటికీ పూర్తికాలేదు. సాగర్ జలాలతో ఉన్న పథకాలకూ వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలువకు నీటిని నిలిపేశాక స్టోరేజీ ట్యాంకులు పూర్తిస్థాయిలో జనం అవసరాలు తీర్చలేకపోతున్నాయి.చివరికి ట్యాంకర్లతోనే నీటిని అందించాల్సిన పరిస్థితి వచ్చింది.

మహారాజశ్రీ ఒకటవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో:ఒంగోలు

EA.No. 102/2025
IN
EA.No.626/2024
IN
EP.No.82/2022
IN
OS. No.77/2018.

ముత్యాల హిమబిందు ... డిహెచ్ఆర్ /ప్లైంటిఫ్
Vs
ఆలూరు సతీష్ ... జె.డి.ఆర్ /రెస్పాండేంట్

To
ప్రతివాది
ఆలూరి సతీష్, తండ్రి జాలయ్య,
వయస్సు 35 సంవత్సరాలు,
ఇంటి నెంబర్.20-3-3,మంగలిపాలెం,
ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో శ్రీ కోర్టు వారు మీకు అనేక పర్యాయములు నోటీసులు పంపగా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు నీకు నోటీసు నిమిత్తం 23-06-2025నకు వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పైతెలిపిన కోర్టు లో నీవు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేని యడల నీపరోక్షమున తీర్మానించబడునని తెలపటమైనది.

// కోర్ట్ వారి అనుమతి మేరకు //

ఇట్లు
ఎం.సుకన్య
ఆర్.ప్రశాంత్.
అడ్వకేట్స్, ఒంగోలు.
సెల్ : 9247125145.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 315/2024

పడుచూరి మాధవి .. వాది
ఎదిరి
కొళ్ళి మల్లిఖార్జున రావు .. ప్రతివాది
టు,
కొళ్ళి మల్లిఖార్జున రావు తండ్రి సుబ్రహ్మణ్యం,
కందులాపురం గ్రామము, కంభం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో దావా పరిహారం కోరుతూ వాది నీపై దావా దాఖలు చేసియున్నది. సదరు దావాలో నీ హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు తేదీ 12-05-2025 కి వాయిదా వేసి యున్నారు. కావున పైతేదీన ఉదయం 10-30 నిమిషాలకి పై కోర్టువారి ఎదుట హాజరై నీకు ఆక్షేపణలు వున్నట్లయితే తెలుపుకునేది. లేనిచో దావా నీపరోక్షమందు తీర్మాణించ బడునని ఇందుమూలముగా తెలుపడమై నది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శివపురం విజయ భాస్కరరావు,
అద్వకేట్, గిద్దలూరు.
సెల్ నెం. 9866391691

మహారాజ శ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 180/2018

మండే వెంకటేశ్వర్లు ...వాది
వర్సెస్
ఉప్పు చిరంజీవి మరియు వగైరాలు... ప్రతివాదులు

To,
D3) ఓర్సు విజయ,
భర్త వెంకట రమణయ్య,
R/o. మర్రిపూడి గ్రామం,
మర్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావా తేది :16-05-2025 దిన మీ నోటీసు కొరకు ఉన్నది. కావున పై నెంబర్ దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది:16-05-2025నఉదయం గం.10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచొ మీపరోక్షమున తీర్మానించ బడునని మీకు తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేది :10-05-2025.
వాయిదా తేది: 16-05-2025.

ఇట్లు.
వరికూటి నాగరాజు, B.Com., B.L.
వాది తరుపున అడ్వొకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ నెంబర్ : 8985563337
9440140498.

ప్రజాశక్తి
ఆదివారం 11 మే 2025

తెల్లారిన 'కూలి' బతుకులు

టైల్స్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా

ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మృతి

తిమ్మరాజుపాలెం వద్ద ఘటన

ప్రజాశక్తి-పర్చూరు

పొట్టకూటి కోసం కూలీకి వెళ్లిన నిరుపేదల బతుకులు తెల్లారేలోపే గాల్లో కలిసిపోయాయి. టైల్స్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. వీరి మీద ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలో తిమ్మరాజు పాలెం గ్రామ సమీపంలోని హైవేపై శనివారం తెల్లవారు జామున జరిగింది.

టైల్స్‌తో వెళ్తున్న లారీ హైవే మార్జిన్లో బోల్తా పడడంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికులు అందించిన వివరాల మేరకు.. లారీలో డ్రైవర్‌తో పాటు నలుగురు కూలీలు ప్రయాణిస్తున్నారు. ఒక వ్యక్తి డ్రైవర్ కేబిన్‌లో ఉండగా మిగిలిన ముగ్గురు కూలీలు లారీలోని టైల్స్‌పై కూర్చొని ఉన్నారు. టిప్పర్ ఎదురుగా రావడంతో తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. కేబిన్‌లో ఉన్న లారీ డ్రైవర్, కూలీ క్షేమంగా బయటపడ్డారు. వెనుక టైల్స్‌పై ఉన్న ముగ్గురు కూలీలు కూలీలు అక్కడికక్కడే టైల్స్ కింద పడి మృతి చెందారు. రోడ్డు ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎస్‌ఐ జే.మాల్యాద్రి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని టైల్స్ కింద

బోల్తాపడిన లారీని పైకి తీస్తున్న దృశ్యం

పడి మృతి చెందిన వారి మృతదేహాలను వెలికి తీసి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోల్తా కొట్టిన లారీని ట్రాఫిక్కు ఎలాంటి అంతరాయం కలగకుండా యంత్రాల సహాయంతో వెలికి తీసి రోడ్డుపై పెట్టారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ షేక్ మస్తాన్‌వలిని అదుపులోకి తీసుకొని పర్చూరు స్టేషన్‌కు తరలించారు. మృతి చెందిన వారిలో మార్టూరుకు చెందిన కూలీలు తాళ్లూరి ప్రభుదాసు, పాలపర్తి శ్రీను ఉండగా, నూతలపాడుకు చెందిన కూలి తమ్మిలూరి సురేంద్ర మృతి చెందినట్లు తెలిపారు. మార్టూరు గ్రానైట్ కంపెనీ నుంచి టైల్స్ లోడ్‌తో బయలుదేరిన లారీలు నేరుగా పేట హైవే వెళ్లి గుంటూరు చేరాల్సి ఉండగా, పేట సమీపంలోని బొప్పూడి నుంచి పిడుగురాళ్ల - వాడరేవు గుండా ప్రయాణించి పర్చూరు మీదుగా గుంటూరుకు వెళుతున్నాయి. ఈ సమయంలో ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని తెలిసింది.

సిఐ ఎం.శేషగిరిరావు, డీఎస్పీ రామాంజనేయులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీస్ సిబ్బందిచే వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉంటే హైవే పనులు కోసం వినియోగిస్తున్న గ్రావెల్, ఇసుక టిప్పర్లు గ్రామాల్లో మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయని వేగాన్ని అదుపు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం పట్ల ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం సమీపంలో లారీ బోల్తా ఘటనలు ముగ్గురు మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు ఎమ్మెల్యే ఏలూరి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. లారీ బోల్తా ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఒకే కుటుంబానికి చెందిన సమీప బంధువులు మృతి చెందడం ఆ కుటుంబాలకు తీరని లోటు అన్నారు. లారీ బోల్తా ఘటన చాలా బాధాకరమన్నారు. తెలుగుదేశం పార్టీకి ఆ కుటుంబాలు అనాదిగా విధేయులుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

నకిలీ పట్టాలు సృష్టించిన వైనం

దర్జాగా వ్యాపార సముదాయం నిర్మాణం

మండల జనసేననాయకుడి నిర్వాకం

ప్రజాశక్తి- కురిచేడు

మండలం కేంద్రమైన కురిచేడులో సుమారు రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురయింది. ఆక్రమణ దారుడు నకిలీ పట్టాలు పొంది అందులో వ్యాపార సముదాయం నిర్మించాడు. కురిచేడులోని సర్వే నెం. 246/2ఎలో య. 1.57 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఇప్పటికి ఆ భూమిలో గ్రామ పంచాయితీ కార్యాలయం, పశువైద్య కేంద్రం, యన్.ఆర్.ఇ.జి.యస్. కార్యాలయం, స్త్రీశక్తి భవన్, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి ఉన్నారు. మిగిలిన య.0.23సెంట్ల భూమిని ఆర్.టి.సి. బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టడానికి కేటాయించారు. ఆర్.టి.సి. అధికారులు అక్కడ బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ భూమి ఖాళీగా ఉంది. ఖాళీగా ఉన్న భూమిలో గత 10 సంవత్సరాల నుండి కంభంపాటి మరియు బాబు అనే యువకుడు వాటర్ సర్వీసింగ్ పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ భూమిపై కన్నేసిన మండల జనసేన నాయకుడు రాత్రికి రాత్రే వాటర్ సర్వీసింగ్ పాయింట్‌ని బుల్డోజర్‌తో చదరం చేశాడు. దీనిపై ఆ దళిత యువకుడు తనకు జరిగిన అన్యాయాన్ని రెవిన్యూ అధికారులకు, పోలీసులకు తనపై జరిగిన అన్యాయానికి యస్.సి., యస్.టి. కేసు నమోదు చేసి

రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

యున్నాడు. ఈ భూమికి రెవిన్యూ అధికారులు, పంచాయితీ అధికారులు చోద్యం చూశారే తప్ప ఆక్రమణదారునిపై ఎటువంటి చర్య తీసుకోలేదు. ఈ భూమిపై ఎవరికి హక్కులున్నాయని ఒక వ్యక్తి రెవిన్యూ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం క్రింద సమాచారం కోరగా సదరు సర్వే నెంబరులో గల భూమి ప్రభుత్వ భూమి క్రిందే ఉందని, ఈ భూమికి ఎటువంటి హక్కులు ఎవరికి కల్పించలేదని మా కార్యాలయంలో ఈ భూమిపై ఎటువంటి సమాచారం లేదని లిఖిత పూర్వకంగా తెలిపారు. ప్రభుత్వ భూమిలో భవనాలు నిర్మిస్తుంటే చూస్తు మౌనంగా ఉండటంలో ఎవరికి అర్థం కావడంలేదు. పంచాయితీ కార్యాలయం ప్రక్కనే ఎటువంటి పంచాయితీ అనుమతులు లేకుండానే ఈ భూమిలో వ్యాపార సముదాయ నిర్మాణం జరుగుతుంటే పంచాయితీ అధికారులు చూస్తుండిపోయారు తప్ప నిర్మాణం చేపట్టిన వారిపై ఎటువంటి చర్యలు గైకొనలేదు. నష్టపోయిన దళిత యువకుడు ఆయన కుటుంబ సభ్యులతో తహశీల్దారు కార్యాలంయ వద్ద ధర్నా చేపట్టడంతో స్పందించిన రెవిన్యూ అధికారులు య.0.24సెంట్ల భూమిలో రెండు సెంట్ల భూమి మాత్రమే ప్రభుత్వ భూమి అని దీనిపై ఎటువంటి ఆక్రమణలు జరిగినా తగు చర్యలు తీసుకుంటామని రెవిన్యూ అధికారులు అక్కడ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఐ

రెవెన్యూ అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతున్న శ్రీపతి రంగనాథ్‌పై చర్యలు తీసుకోవాలని కురిచేడు ఆర్ఐ నాగరాజు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహశీల్దార్ రామా నాయుడు ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు ఆర్ఐ తెలిపారు.

కొలుపులు విషయంలో వివాదం

నాగులుప్పలపాడులో ఉద్రిక్తత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడులో అంకమ్మదేవర కొలుపులు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది. దేవాలయానికి అప్పట్లో మారెళ్ళ అమ్మన్న ధర్మకర్తగా వ్యవహరించేవారు. ఆయన మరణించిన తరువాత కుమారుడు శివ వ్యవహరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో శివ మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆలయానికి చెందిన బంగారం, నగదును శివ మాయం చేసారని ఆ సామాజిక వర్గానికి చెందిన కొందరు స్థానికులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాలు విడిపోయారు. ఈవిషయమై ఒక వర్గం వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నుంచి కొలుపులు జరుపుకోవడానికి అనుమతులు వచ్చాయని, వాటిని అమలు చేయాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఓ వర్గం వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో స్థానికేతరులకు ఎస్ఐ శ్రీకాంత్ మద్దతుగా నిలిచారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి జరగాల్సిన కొలుపులకు సంబంధించి స్థానికులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అదేక్రమంలో ఇంకొల్లుకు చెందినవారు మేము కొలుపులు నిర్వహిస్తామని దేవస్థానం వద్దకు చేరుకున్నారు. దాంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. దాంతో వారు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. మనస్తాపానికి గురైన గుంజి అంకమ్మ, శ్రీనివాసరావులు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. దాంతో వారిని, గాయపడిన వారిని 108 వాహనంలో ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు తమకు న్యాయం జరగలేదని రాస్తారోకో చేపట్టారు. ఆ సందర్భంలో ఎస్ఐ డౌన్‌డౌన్ అంటు నినాదాలు చేస్తూ రోడ్డుపై బైటాయించారు. సమాచారం తెలుసుకున్న సిఐ శ్రీకాంత్ బాబు, ముగ్గురు ఎస్ఐ లు రాపిడ్ పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసారు. అయినప్పటికి ససేమిరా అంటూ నినాదాలు చేస్తుండటంతో మహిళలతో పాటు కొంతమందిని అదుపులోకి తీసుకొని మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రెండు గ్రూపులను చెదరగొడుతున్న పోలీసులు

కర్నాటక వాసి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దారవీడు

కర్నాటక రాష్ట్రానికి చెందిన లోకేష్(35) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పెద్దారవీడు మండలం చాట్లమడ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై నిర్మాణంలో గల బ్రిడ్జి వద్ద శనివారం వెలుగు చూసింది. బ్రిడ్జి వంతెనకు గల ఇనుప చువ్వలకు తాడు బిగించి ఉరి వేసుకున్నాడు. కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా అతనివద్ద గల డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా గుర్తించారు. బ్లూ కలర్ బార్డర్ కలిగిన ఎర్రటి రంగు బనియన్, లైట్ షేడ్ గల బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని గురించి తెలిసిన వారు పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పి.అనిల్‌కుమార్ కోరారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలంలోని పోతంపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందాడు. ఈదురు గాలులు, మెరుపులతో పాటు పిడుగులు పడ్డాయి. ఈ ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన వలపర్ల గాలయ్య(55) మృతి చెందారు.

గాలయ్య మృతదేహం

పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలోని కొండేపల్లి మార్గంలో ఇటీవల కాలం వెలసిన మల్లికార్జున టౌన్‌షిప్ వెంచర్‌లో తాటాకు గుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఈ వెంచర్ బెల్లంకొండ గోపికి చెందినదిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా.

తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌పి

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఒంగోలులో తనిఖీలు నిర్వహించిన ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. జిల్లాలో నేరాలు నియంత్రణ, శాంతి భద్రతలను పరిరక్షణ, అసాంఘిక శక్తుల కదలికలను నిరోధించే లక్ష్యంగా జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలోని మొత్తం 50 ప్రదేశాలలో పోలీసు అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయి. ఒంగోలు నగరంలోని ముఖ్యమైన కూడళ్ళు, రహదారులపై వాహనాలు, శివారు ప్రాంతాలలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు.

ఈ తనిఖీలో రికార్డులు సరిగా లేని పలు మోటార్ సైకిల్ మరియు ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్న వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన యెడల చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించామని, చట్ట వ్యతిరేక పనులకు, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100/112 తెలియజేయాలని ప్రజలను కోరారు. తనిఖీలలో డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, సి ఐలు నాగరాజు, శ్రీనివాసరావు,అజయ్ కుమార్, సుబ్బారావు, బీమా నాయక్, అస్సన్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, జగదీష్, పాండురంగారావు, మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్, రామారావు, సోమశేఖర్, శ్రీనివాసరావు, సమ్మిముల్లా, హాజరత్తయ్య, ఖాజావలి, సుబ్బారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు కొనసాగించటమే నిజమైన నివాళి

- అందరినీ ఆలోచింపజేసిన అంబేద్కర్ జీవిత చిత్రం
- అంబేద్కర్ కొందరివాడు కాదు. అందరివాడు
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - చీరాల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు ఈతరం యువత స్ఫూర్తిగా తీసుకొని కొంసాగించటమే నిజమైన నివాళి అర్పించడమని తహశీల్దారు జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 'బుద్ధం శరణం గచ్చామి' నాటకం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం కెవిపిఎస్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి టి కృష్ణమోహన్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనలు ప్రపంచ దేశాలు అనుకరిస్తుంటే దేశంలో బిజెపి ప్రభుత్వం తీవ్రంగా అవమానిస్తోందని, రాజ్యాంగ హక్కులు కాలరాస్తుందని అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి రాజ్యాంగం మార్చే దిశగా అడుగులు వేస్తున్న దశలో రాజ్యాంగం కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించడానికి అంబేద్కర్ నాటక ప్రదర్శన రాష్ట్రవ్యాప్తంగా కెవిపిఎస్ జ్ఞాన యుద్ధం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 22న కర్నూల్ జిల్లాలో ప్రారంభించిన నాటకం 755వ ప్రదర్శనగా చీరాలలో చేపట్టినట్లు తెలిపారు.

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తహశీల్దారు ప్రభాకరరావు

దేవేంద్ర రచనలో తూము శివప్రసాద్ దర్శకత్వంలో చేపట్టిన ప్రదర్శనలు ఈ నెల 17న విజయవాడలో ముగుస్తుందన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు నాటికను వీక్షించారు. అంబేద్కర్ విద్యార్థి జీవితం, ఆయన ఎదుర్కొన్న సామాజిక వివక్ష, ఉన్నత విద్య అభ్యసించడానికి ఆయన పడిన తపన, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్ర, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కీలకమైన కృషిని కళాకారులు తమ ప్రదర్శనలో భావోద్వేగంగా చూపించారు. సమానత్వం కోసం ఆయన చేసిన ఉద్యమాలు ప్రేక్షకులను కదిలించాయి. అంబేద్కర్ చూపిన బాటలో నడవాల్సిన ఆవశ్యకత నొక్కి చెప్పారు. కళాకారుల ప్రతిభను, వారి హావభావాలకు ప్రేక్షకులు చప్పట్లతో తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్ జయరాజు, జిల్లా నాయకులు కె శరత్, కెవిపిఎస్ పట్టణ ఉపాధ్యక్షులు ఎన్ బాబురావు, కౌలు రైతు సంఘం నాయకులు పి కొండయ్య, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చేగుడి సురేష్, బ్యాంకు ఉద్యోగ నాయకులు ఎన్ సురేష్, చేనేత నాయకులు మాచర్ల మోహనరావు, ప్రజా సంఘాల నాయకులు ఎన్ మోహన్ కుమార్ ధర్మ, ఊటుకూరు వెంకటేశ్వర్లు, రాయుడు రవి కుమార్, నూకతోటి బాబురావు, మెప్మా సిఎంఎం డొక్కా చిన్న కొండయ్య పాల్గొన్నారు.

పెన్సిల్ లెడ్‌పై అంబేద్కర్ జీవిత చిత్రం

చీరాలకు చెందిన విద్యార్థి మహతి డాక్టర్ అంబేద్కర్ జీవితాన్ని పెన్సిల్ లెడ్పై లిఖించిన సూక్ష్మ రూపకాన్ని నిర్వాహకులు ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. ప్రపంచంలో మొదటి సారి చేసిన ఆమె ప్రయత్నాన్ని అభినందించారు.



అంబేద్కర్ నాటికలో సన్నివేశాలు ప్రదర్శనలు

ఆనాటి వెలివాడల జీవన చిత్రాన్ని కళ్లకు కట్టినట్లు చూపిన కళాకారులు

కార్మికులను బానిసలను చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

కార్మికులాను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ రద్దు కోరకు ఈనెల 20న జరగనున్న సమ్మె జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు ఉమ్మడి సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక ఆదర్శ కాలేజీలో జరిగిన ఉమ్మడి సదస్సుకు ఎఐటియుసి నాయకులు సింగం వాణి శ్రీ, సిఐటియు నాయకులు కె ఝాన్సీ, ఐఎఫ్టియు నాయకులు శివనాగులు, ఏఐఎఫ్టియు నాయకులు కె వాణి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట సుబ్బయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, ఐఎఫ్టియు నాయకులు మేకల ప్రసాద్, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎం శోభా రాణి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి శ్యామేలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ధరల పెరుగుదలకు పరిహారంతో పాటు 5ఏళ్లకోసారి కనీస వేతనాల సవరణ చేయాలని, కేంద్రంలో 8వ వేతన సంఘాన్ని, రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని నియమించాలని కోరారు. ఫిక్సడు టర్మ్ ఎంప్లాయిమెంట్, అగ్నిపథ్ స్కీములను రద్దుచేయాలని, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టీకరణ రద్దుచేయాలనిఅన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీల భర్తీ చేయాలని, 8గంటల పనిదినం అమలు చేయాలని, వాణిజ్యీకరణ, కేంద్రీకరణ, మతతత్వీకరణను ప్రోత్సహించేందు కు రూపొందిన నూతన విద్యా విధానాన్ని రద్దుచేయాలని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.9 వేలు నిర్ణయించాలని కోరారు. సదస్సులో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్టియూ, ఏఐఎఫ్టియూ న్యూ కేంద్ర కార్మిక సంఘాలు నాయకులు పి నాగాంజనేయులు, ఈశ్వరరావు, జి బాలాజీ, కెవి లక్ష్మణరావు, పి బిక్షాలు, కోన శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్

వేతనాలు అందక ఉపాధి కూలీల అవస్థలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది ఫిబ్రవరి నుండి ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోతున్నారు. మార్చిలో ఆర్థిక సంవత్సరం పూర్తయినప్పటికీ జనవరి నెల వరకు మాత్రమే చేసిన పనులకు వేతనాలు అందాయని, ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు ఎలాంటి వేతనాలు అందకపోవడంతో ఈ పనులపైనే ఆధారపడి జీవిస్తున్న కూలీలకు పూట గడవడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 7, 8 వారాలకు పైగా జరిగిన పనులకు వేతనాలు అందలేదని, పూర్తిస్థాయిలో పని దినాలు జరిపించకపోగా జరిగిన పని దినాలకు వేతనాలు అందకపోతే ఏ విధంగా జీవించాలని ప్రశ్నిస్తున్నారు. గత మార్చి, ఏప్రిల్ నెల వరకు కొంతమంది వ్యవసాయ పనులు చేసుకుని జీవించినప్పటికీ ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి హామీ పథకం పనులపైనే ఆధారపడి ఉన్నామని, సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 2.35 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉంది. జూన్ నుండి జూలై నెల ఆరంభంలో వర్షాలు ప్రారంభమైతే ఇక్కడ కూలీలకు ఉపాధి పనులు జరిపించే అవకాశం లేదు. ఉన్నా ఈ కొద్ది సమయంలోనే కూలీలకు పని దినాలను కల్పించాల్సి ఉంది. డెల్టా ప్రాంతంలో చిన్న చిన్న సాగునీటి కాలువలు మినహా ఎలాంటి పనులు జరిపేందుకు అవకాశం కనిపించడం లేదు.

ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

లక్ష్యాన్ని చేరుకోవడానికి అవస్థలు

ఈ ఏడాది నిర్దేశించిన పని దినాల లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు అవస్థలు పడుతున్నారు. ఓ ప్రక్క ఉన్నతాధికారుల ఒత్తిడి, మరోపక్క పనులు జరిపించేందుకు కాలువలు లేక నీటి కుంటలు తీయించేందుకు అధికారులు శతవిధాల కృషి చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు జరిగిన పనులకు కూలీలకు అందాల్సిన వేతనాలను తక్షణమే విడుదల చేస్తే వారికి కొంతమేర ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు. పనుల మాట దేవుడేరుగు ఇప్పటివరకు తాము చేసిన పనులకు వేతనాలు అందిస్తే కొంతమేర ఆర్థిక సమస్యలు తీరతాయని కూలీలు కోరుతున్నారు. ఆ మేరకు ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అమృతలూరు

నియోజకవర్గంలో అన్ని మండలాల్లో, గ్రామాల్లో సంస్థగత ఎన్నికలు పూర్తి చేసుకోవాల్సి ఉందని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచించారు. తెలుగుదేశం మండడల విస్తృత స్థాయి సమావేశం శనివారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సాధికార సారదలను నియమించుకున్నట్లు తెలిపారు. బూతులు, గ్రామ కమిటీలను పూర్తి చేసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు పాత విధానాన్ని అమలు చేస్తున్నామని దీనిలో కొత్తగా బూతు కన్వీనర్లకు తోడుగా కో కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ కో కన్వీనర్లను నియమించు కోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చుండూరు, కొల్లూరు సమావేశం

చుండూరు తెలుగుదేశం విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10గంటలకు జరుగుతుందని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు కార్యాలయ వర్గాలు తెలిపాయి. కొల్లూరు మండల స్థాయి సమావేశం సాయంత్రం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొర్రపాటి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొర్రపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

శతాధిక నాటక రచయిత, నవ యువ నటుల, స్ఫూర్తి ప్రదాత కొర్రపాటి గంగాధరరావు బాపట్ల వాస్తవ్యులు కావడం ఎంతో గర్వకారణమని సాహితి భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. కొర్రపాటి గంగాధర రావు 13వ జయంతి సందర్భంగా పట్టణంలో జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో కొర్రపాటి చిత్ర పటానికి పూలమాలవేసి శనివారం నివాళులు అర్పించారు. 1950 – 60 దశకాల్లో తెలుగు రాష్ట్రాల్లో ప్రతినిత్యం ఏదో ఒక వేదికపై కొర్రపాటి రచించిన నాటక ప్రదర్శన జరుగుతూనే ఉండేదని అన్నారు. 20 నవలలు, 130 నాటికలు, 12 రేడియో నాటికలు రచించారని అన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త అబ్దుల్ ఖాదర్ జీలాని, సాహితి భారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, కోశాధికారి ఆదం షఫీ, దగ్గు మల్లి శామ్యూల్, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాళిదాసు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దాతలు

ప్రసన్నాంజనేయ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి పట్టణానికి చెందిన నరిశెట్టి నారాయణరావు దంపతులు రూ.1.30లక్షలు, సింగరకొండ పాలెంకు చెందిన కోండి ఆంజనేయులు, హరిప్రియ దంపతులు రూ.1.01లక్షలు, పట్టణానికి చెందిన మానికొండ నాగరాజు, శారదా దంపతులు రూ.1.01లక్షల విరాళాలు ఇఒ మదమంచి తిమ్మనాయుడుకు చెక్కు, నగదు రూపంలో శనివావరం అందించారు.

'శ్రీ హర్షిణి' సిగలో మరో కలికితురాయి

- జిల్లాలోనే ప్రథమ మహిళా ఇంజనీరింగ్ కళాశాల
- బిటెక్, ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల నిర్వహణ
- అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం
- అత్యాధునిక ల్యాబ్‌లు
- రేపు ఏడుగుండ్లపాడులో ప్రారంభం

ప్రారంభోత్సవానికి ముస్తాబైన మహిళా ఇంజనీరింగ్ కళాశాల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీ హర్షిణి విద్యా సంస్థలలో మరో కలికితురాయి చేరబోతోంది. విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ కల 'శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల' నెరవేరబోతోంది. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల సోమవారం ప్రారంభం కానుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి బిటెక్, ఎంబిఎ. ఎంసిఎ కోర్సులను అందించనుంది. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, అత్యాధునిక ల్యాబ్‌లు, విశాలమైన గ్రంథాలయంతో విద్యార్థులకు స్వాగతం పలుకుతోంది. 'శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల' విశేషాలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

ఒంగోలు, ఏడుగుండ్లపాడు, మార్టూరు, అద్దంకిలో శ్రీ హర్షిణి విద్యా సంస్థలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ విద్యా సంస్థలను జిల్లాలో ముందు వరుసలో నిలుపుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల అందుబాటులోకి రానుంది. శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ గోరంట్ల, సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్లు డాక్టర్ హర్షిణి, జివి.హర్షిత్ పర్యవేక్షణలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల నిర్వహణకు శ్రీకారం చుట్టబోతున్నారు.

ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

అందిస్తున్న కోర్సుల ఇవే

శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల బిటెక్, ఎంబిఎ, ఎంసిఎ కోర్సులను అందిస్తోంది. బిటెక్ సిఎస్ఇ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్), సిఎస్ఇ(ఎఐ, ఎంఎల్) కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, మెషీన్ లెర్నింగ్), సిఎస్ఇ(ఎఐ)కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్), ఇసిఇ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్), సిఎస్ఇ(ఎఐ ,డిఎస్) కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, డేటాసైన్స్), బిటెక్- ఐటి(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కోర్సులను అందిస్తోంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్స్ ఎంబిఎ(మాస్టర్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) ఎంసిఎ(మాస్టర్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్) అందుబాటులో ఉన్నాయి.

అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం

శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం విద్యార్థినీ, విద్యార్థులను సాంకేతిక విద్యలో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయా విభాగాల పరిధిలో హెచ్ఒడిలు, ప్రొఫెసర్లు 15-20 సంవత్సరాల అనుభవం కలిగి ఉండటం గమనార్హం. డిజిటల్ తరగతి గదులు, హైస్పీడ్ వైఫై, రవాణా సౌకర్యం. కళాశాల విద్యార్థినులకు 100 శాతం రక్షణ, పర్యావరణ హిత క్యాంపస్‌ను కలిగి ఉంది. విద్యార్థినులకు ఎసి హాస్టల్ సదుపాయం అందుబాటులో ఉంది. ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలను కల్పిస్తోంది. కళాశాలలో చేరిన విద్యార్థినులకు ఇంటి తరహా భోజనం అందించేందుకు యాజమాన్యం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది.

అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అత్యాధునిక లేబొరేటరీలు విద్యార్థినులకు ఉపయోగ పడనున్నాయి. కళాశాలలో 300 మంది సిఎస్ఇ కోర్సును అభ్యసించే విద్యార్థులు ఉంటే 360కి పైగా కంప్యూటర్లు ఏర్పాటు చేయటం గమనార్హం. విశాలమైన గ్రంథాలయం ఉంది. ఇందులో సుమారు రూ.50 లక్షల విలువైన పుస్తకాలను కళాశాల యాజమాన్యం అందుబాటులో ఉంచారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

విద్యార్థినుల బంగారు భవిష్యత్తుకు యాజమాన్యం భరోసా కల్పిస్తోంది. ఇండస్ట్రీస్ ట్రైనింగ్ ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థినులకు విద్యతో పాటు బహుళ జాతి కంపెనీలలో చేరేందుకు అవసరమైన శిక్షణను అందిస్తోంది. కెరీర్ గైడెన్స్ సెల్ ద్వారా విద్యార్థినులు తమ విద్యను పూర్తి చేసే లోపు ఎలాంటి కెరీర్‌ను ఎంచుకోవాలో శిక్షణ ఇస్తుంది. కెరీర్ గైడెన్స్ సెల్ దేశ, విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించాలని ఆసక్తి ఉన్న విద్యార్థినులకు శిక్షణ ఇస్తోంది. కళాశాల విద్యార్థినులకు 100 శాతం ప్లేస్‌మెంట్స్‌ను కల్పించేందుకు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది.

మహిళా ఇంజినీరింగ్ కళాశాలను ఆదరించండి

గోరంట్ల రవికుమార్, శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత

ప్రకాశం జిల్లాలో తొలి మహిళా ఇంజినీరింగ్ కళాశాలను కూడా ప్రజలు ఆదరించాలి. విద్యార్థినులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, అత్యాధునిక ల్యాబ్‌లు, ఇంటి తరహా భోజనం, ఉదయం 4 రకాల అల్పాహారాలు, విశాలవంతమైన ప్రాంగణం, హై స్పీడ్ వైఫై సౌకర్యం కల్పిస్తున్నాం. శ్రీ హర్షిణి విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్న జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు. జిల్లాలో తొలి మహిళా ఇంజినీరింగ్ కళాశాలను ఆదరించాలని కోరుతున్నా.

ధర్నా నిర్వహిస్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

కలెక్టరేట్ వద్ద డిఎస్‌సి అభ్యర్థుల ధర్నా

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

టీచర్ పోస్టుల నియామకానికి నిర్దేశించిన డిఎస్‌సి వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచి నిరుద్యోగులకు ప్రభుత్వం బాసటగా నిలవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. డిఎస్‌సి వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఎస్‌సి అభ్యర్థులు జిల్లా గ్రంథాలయం నుంచి కలెక్టరేట్ వరకూ శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద డివైఎఫ్ఐ నగర కార్యదర్శి వై.దానియేలు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్. బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు పోరాట ఫలితంగా డిఎస్‌సి నోటిఫికేషన్ సాధించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏడు సంవత్సరాల తర్వాత విడుదలైన నోటిఫికేషన్ కు సన్నద్ధం కావడానికి, పరీక్షకు కనీసం 90 రోజుల సమయం లేకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం డిఎస్‌సికి వయోపరిమితి 44 ఏళ్ళు ప్రకటిం చడం వల్ల కొందరు అర్హత కోల్పోయినట్లు తెలిపారు. గత డిఎస్‌సిలో 1,2 మార్కులు తేడాతో ఉద్యోగఅవకాశం కోల్పోయినవారు, డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న వారిలో 44 ఏళ్ళు పై బడిన కొంతమంది ఉన్నారని తెలిపారు. వారిని దష్టిలో పెట్టుకుని డిఎస్‌సి వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ప్రకాశం జిల్లా లో వయోపరిమితి దాటి అర్హత కోల్పోయిన వారు రెండు వేల మందికి పైగా న్నారన్నారని తెలిపారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 44 సంవత్సరాలు ఉన్న వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచి ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపడుతున్నట్లు తలెఇపారు. ఈ కార్యక్రమం డివైఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు టి.నవీన్, రాజు, సుబ్బారావు, జానీ, పార్వతి,సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ పట్ల

అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న ఎస్‌పి తుషార్ దూడి

రాష్ట్రంలోని ఎస్ఐలు ఆపై స్థాయి అధికారులతో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా శనివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి సమీక్ష సమావేశంలో ఎస్‌పి తుషార్ డూడి పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దష్ట్యా రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్‌పిలు ఆపై స్థాయి అధికారులతో రాష్ట్ర డిజిపి వీక్షణ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భద్రత ప్రమాణాలను పెంపొందించుకుని, శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను అరికట్టడం, సీసీ కెమెరాల ద్వారా బోర్డర్ చెక్ పోస్టులను పరిశీలించడం, నిర్మానుష్య ప్రదేశాల్లో నేరాలు అధికంగా జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేసే విధానం, పాత నేరస్తుల కదలికల పై నిఘా ఉంచడం, జిల్లాలతో ఉన్న సరిహద్దు ప్రాంతాలు, జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో నాకాబంది, వాహనాలు తనిఖీలు నిర్వహించడం, గంజాయి వినియోగించేవారు అమ్మే వారి మీద నిఘా, పోలీస్ సిబ్బంది సంక్షేమం తదితర అంశాల విషయాల పై సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేసారని తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన ప్రజలకు సేవలందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో అనుమానస్పద వస్తువులు , వ్యక్తులను నిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు గాని లేదా 100,112 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. మాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి తూషార్ దూడి తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సంధ్య ఆర్ట్స్ గ్యాలరీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో శనివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమ్మర్ క్యాంప్‌కు హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల సమక్షంలో కేకును కోసి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు చిత్రీకరించిన చిత్రాలను వారి తల్లులకు బహుమానంగా అందజేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ సంధ్య రంగుల, శివ నాగజ్యోతి, వేల్పూరి రాధ, ప్రతిక, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 63 మంది విద్యార్థులు బహుళజాతి సాఫ్ట్‌వేర్ సంస్థ కాఫోర్జ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. క్విజ్ ఇంజినీరింగ్ కళాశాలలో కాఫోర్జ్ సంస్థ పతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. రాత పరీక్ష, టెక్నీకల్ రౌండ్, హెచ్‌రౌండ్ లో ప్రతిభ కనబరచిన 63 మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కాఫోర్డ్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్లేస్ మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ విభాగాధిపతి డాక్టర్ జగదీష్, క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ వైవి. హనుమంత రావు అభినందించారు.

సమ్మర్ క్యాంపునకు హాజరైన విద్యార్థులు

బాలల సమ్మర్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రకాశం బాలోత్సవం-ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొప్పోలు బాలల సమ్మర్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డిఎల్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు బానిసలై సమయాన్ని వథా చేసుకోకుండా, వారిలోని సజనాత్మకతను బయటకు తీసేందుకు, విద్యార్థులలో దేశభక్తి భావాలు నింపేందుకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినోద భరితంగా వారం రోజుల పాటు సాగే ఈ వేసవి శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్,ఒరిగామి (బొమ్మలు,పూలు తయారు చేయుట)పెయింటింగ్, పాటలు,మెమొరీ గేమ్స్,సరదా గణితం, హ్యాండ్ రైటింగ్ లాంటి అంశాలలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వాకా వెంకటేశ్వర్ రెడ్డి, దాసరి లక్ష్మీ ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

మురళీ నాయక్‌కు నివాళి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రకాశం బాలోత్సవం, ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ చిల్డ్రన్ క్యాంపులో ఇండియన్ ఆర్మీలో పనిచేస్తు మురళి నాయక్‌కు శనివారం నివాళులు అర్పించారు. స్థానిక ఎల్బిజి భవన్లో జరిగిన కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ నిర్వాహకులు మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడుతూ భారత్ – పాకిస్తాన్ యుద్ధఘటనలో వీరోచత పోరాటం జరిపిన భారత సైనికుడు మురళి నాయక్ అమరుడవడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన త్యాగం వృధా కాదని, ఆయన త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరిచిపోదని అన్నారు. అనంతరం దేశభక్తి గేయాలు, అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కాగా బాలికలకు ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ పట్ల అవగాహన అవసరమని కరాటే మాస్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శారీరిక దృఢత్వం పెంచుకునేందుకు కరాటే దోహద పడుతుందని తెలిపారు. బాలలకు 'కరాటే మెళుకువలు' నేర్పారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ భాస్కర్ శాస్త్రి, అబ్దుల్ మాలిక్, టీచర్ యామిని, మ్యాజిక్ రామన్, వీరాస్వామి, సి హెచ్ వినోద్ పాల్గొన్నారు.

రేణింగవరంలో మదర్స్ డే

తల్లిని గౌరవించాలి

ప్రజాశక్తి - పంగులూరు

ప్రతి ఒక్కరూ తల్లులను గౌరవించినప్పుడే సమాజానికి విలువ వస్తుందని ఐసిడిఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్వైజర్ ఎన్ పద్మజా అన్నారు. మండలంలోని రేణింగవరం దళిత కాలనీలోని అంగన్‌వాడి సెంటర్లో తల్లికి వందనం కార్యక్రమం కింద మదర్స్ డే శనివారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తల్లికి బిడ్డేనని, బిడ్డలందరికీ నడక, నడత నేర్పించే మొదటి గురువు తల్లేనని అన్నారు. తల్లుల పట్ల ఆదర్శవంతంగా, ప్రేమ, దయతో మెలగాలని చెప్పారు. ఎక్కడైతే తల్లి గౌరవించబడుతుందో అక్కడ ఆనందం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని కొంత మంది తల్లులను పూలమాలతో సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో రేణింగవరం2 అంగన్‌వాడి కార్యకర్త పి షైనీ, ఆయా సుబ్బరావమ్మ పాల్గొన్నారు.

యద్దనపూడిలో తల్లులను గౌరవిస్తున్న దృశ్యం

యద్దనపూడి : మండలంలోని గన్నవరంలో తల్లికి వందనం శనివారం నిర్వహించారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా అంగన్‌వాడి కేంద్రం నందు తల్లులకు పిల్లలచే గౌరవించబడటం, తల్లులు పిల్లలను దీవించటం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుండే తల్లి, దండ్రులను, పెద్దలును గౌరవించడం నేర్పాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి హేమలత, పి సునీత, పి ఝాన్సీ పాల్గొన్నారు.

పొగాకు రైతు ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన బిల్లా శాంసన్ అనే కౌలు రైతు కంపెనీలు పొగాకు చెక్కులు తొక్కమని, చెక్కులు తొక్కిన తరువాత పొగాకు బాగా లేదు వద్దన్నారని మనస్థాపంతో శుక్రవారం రాత్రి గడ్డి మందు తాగిన ఆత్మహత్యా ప్రయత్నం చేసిన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన బిల్లా సాంసన్ అనే రైతు 25 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని నల్లబర్లి పొగాకు సాగు చేశాడు. ఇప్పటివరకు పొగాకు ఒక్క చెక్కు కూడా అమ్ముడు పోలేదు. పొగాకు చెక్కులు తోక్కిన కూలీలకు కూలి కూడా ఇవ్వలేదు. జిపిఐ కంపెనీకి చెందిన ప్రసాదు అనే కంపెనీ ఉద్యోగి గ్రామానికి వచ్చి పొగాకు మండేను పరిశీలించాడు. పొగాకు చెక్కులు తొక్కు పొగాకు కొనుగోలు చేస్తామని చెప్పాడు. ఆ ఉద్యోగి చెప్పిన విధంగా మండేను పొగాకు చెక్కులు తొక్కాడు. అయితే ప్రసాదు అనే ఉద్యోగి పొగాకు నీది బాగాలేదని చెప్పాడు. పొగాకు చెక్కులు తొక్కిన కూలీలకు కూలైనా ఇవ్వాలి, మీరు చెప్పినట్లు బేళ్లు కట్టాము కదా కనీసం ఐదారు చెక్కులైన కొనుగోలు చేయండని శాంసన్ ప్రాధేయపడ్డాడు. అయినా కనీసం ఒక్క చెక్కు కూడా కొనుగోలు చేయలేదు. దీంతో మనస్థాపం చెందిన

వైద్యశాల్లో చికిత్స పొందుతున్న రైతు శ్యాంసన్

సాంసన్ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తమ ఇంటి వద్ద గడ్డి ముందు తాగాడు. పొలం పెట్టుబడికి పెట్టిన అప్పులతో పాటు కనీసం చెక్కులు తోక్కిన కూలి కూడా ఇవ్వలేకపోయానని, అప్పుల బాధతో తమకు తెలియకుండా చనిపోవటానికి గడ్డి మందు తాగాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గడ్డి మందు తాగిన అతనిని ఇంకొల్లు ఆసుపత్రికి తీసుకెళ్లగా వెంటనే మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు అతని పరిస్థితి మరో మూడు, నాలుగు రోజులు సమయం గడిస్తే గాని చెప్పలేమని తెలిపారు.

ఇంకొల్లుకు పొంచి ఉన్న వర్షపు నీటి ముప్పు

- అనాలోచితంగా నాగుల చెరువు డ్రైనేజ్ నిర్మాణం
- పొలాలకు సైతం పొంచి ఉన్న నీటి ముంపు
- కాంట్రాక్టర్లు, అధికారులకు కాసుల పంట
- గ్రామస్తులకు వరద ముప్పుతో తిప్పలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత కొన్ని రోజులుగా రక్షిత నీటి చెరువైన నాగుల చెరువు అభివృద్ధి పనులు సంబంధిత కాంట్రాక్టర్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ డ్రైనేజీ నిర్మాణానికి ఆర్డబ్ల్యూఎస్ ద్వారా మురుగు కాలవ నిర్మాణం పేరుతో రూ.34 లక్షలు మంజూరైనట్లు ఆర్డబ్ల్యూఎస్ డీఇ సతీష్ చంద్ర, జెఇ జ్యోతి తెలిపారు. అయితే ఈ పనులకు సంబంధించిన అంచనాలు, డిపిఆర్ రిపోర్టును అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఈ డ్రైనేజీ అనాలోచిత నిర్ణయంతో తీసుకున్నట్లు ఆ ప్రాంత ప్రజలు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ డ్రైనేజి నిర్మాణంతో అ పక్కనున్న పంట పొలాలకు వరద సమస్యతోపాటు గ్రామానికి ముంపు సమస్య ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై కాంట్రాక్టర్, అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వటం లేదు. తాము సాంకేతికంగా మట్టం లెవెల్ చూసే డ్రైనేజీ నిర్మాణం చేశామని చెబుతున్నారు. గతంలో వర్షపు నీరు వచ్చే పాత కాలువకు ప్రస్తుతం నిర్మించిన కాలువ మట్టానికి మూడు నుంచి నాలుగు అడుగులు వ్యత్యాసం ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

పంట పొలాలకు పొంచి ఉన్న ముంపు

ఈ డ్రైనేజీ నిర్మాణంతో ఎగువన పాతం ఇడుపుల పాడు డొంకకు ఇరువైపులా ఉన్న పంట పొలాలకు వరద ముప్పు తప్పదని అంటున్నారు. ఈ డోంకల ఎగువ ప్రాంతం నుండి దాదాపు 200 ఎకరాల సాగు భూమికి వర్షపు నీరు శతాబ్దాల తరబడి డొంకను ఆనుకొని ఉన్న వరవ కుండ శుద్ధ బాయి కుంట నుండి నాగుల చెరువులోకి ప్రవహిస్తుంది. అయితే అధిక వర్షాలు కురిసినప్పుడు 30 క్యూసిక్కులపైన ప్రవహిస్తూ 22 ఎకరాల విస్తీర్ణం గల నాగుల చెరువుకు 3 గంటల సమయంలోనే నిండిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మురుగు నీటి నివారణ పేరుతో డ్రైనేజీ నిర్మాణాన్ని సొసైటీ వద్ద నుంచి పశువుల ఆసుపత్రి వైపుకు మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల లోతుతో కాంక్రీట్ నిర్మాణం చేశారు. చెరువుకు నీరు వచ్చే వరవ కాలువ శుద్ధ బాయి కుంటను పూడ్చి మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల ఎత్తుతో కాల్వ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాలతో వర్షపు నీరు చెరువులోకి చుక్క కూడా చేరే ప్రసక్తి లేదు. రెండు నిర్మాణాలతో నీరు బయటకు పోయే నిర్మాణం కూడా 3అడుగుల ఎత్తు, వెడల్పుతో నిర్మించారు. వీటి ప్రకారం ఆరు అడుగుల నీరు మూడు అడుగుల నిర్మాణం గుండా బయటకు ఎలా పోతుందని గ్రామస్తులు అంటున్నారు. గతంలో చెరువుకు వర్షపు నీరు వచ్చే వరవ ఎత్తుకు సంబంధం లేకుండా లెవెల్

పల్లం లేకుండా మూసుకుపోయిన కాలువ

ఎక్కువ పెట్టి కాలువ నిర్మాణం చేశారు. ఈ మురుగు కాల్వల నిర్మాణం కింద నుండి వర్షపు నీరు పోవాలంటే పాత వరవలో నీరు మూడడుగుల ఎత్తు నిలబడి ఆ మట్టానికి వచ్చిన తర్వాతనే కాల్వల గుండా ప్రవహించదు. దీంతో పొలాల్లో నీరు నిలిచి పంటలు మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

గ్రామానికి పొంచి ఉన్న ముంపు ముప్పు

అనాలోచితంగా డ్రైనేజీ నిర్మాణంతో భవిష్యత్తులో అధిక వర్షాల వస్తే గ్రామానికి ముంపు తప్పదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం నిర్మించిన మురుగు కాలువ ద్వారా వర్షపు నీరు బయటకు పోయే పరిస్థితి లేదని, నీరు ఎగదోసి వరవల్లో నిలబడి పంట పొలాల మీదుగా పావులూరు రోడ్డుకు చేరుతుంది. అక్కడి నుంచి పావులూరు రోడ్డు వెంట ఉన్న డిఎన్టి కాలనీ, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పోలేరమ్మ గుడి ప్రాంతం తోపాటు పాత గ్రామం మురుగు నీటి కాలువకు చేరుతుంది. పాత మురుగు కాలవ డిఎన్టి కాలనీ వద్ద నుంచి గంగవరం రోడ్డు మీదుగా పాత వడ్డెరపాలెం, అక్కడ నుంచి ముస్లిం కాలనీ, అప్పేరుకు చేరుతుంది. అయితే ఆ కాలువలు ఆక్రమణకు గురై మూసుకుపోయాయి. ప్రస్తుతం వర్షాలు పడినప్పుడే ఈ ప్రాంతాలలో నీరు నిల్వ చేరుతుంది.

వర్షపు నీరు చెరువుకు చేరదు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల సంరక్షణ పథకం పేరుతో వర్షపు నీరు పొదుపు చేయమని, వర్షపు నీరు వృధా కాకుండా ఉపయోగించుకునే అవకాశాలు చూడండని అధికారులకు చెబుతున్నాయి. అయితే ప్రస్తుత డ్రైనేజీ నిర్మాణంతో వర్షపు నీరు నాగుల చెరువులోకి గతంలో మాదిరి వచ్చే అవకాశం లేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోతే వారు చెప్పిన సమాధానం ఆశ్చర్యం కలిగిస్తుంది.

వరద ముప్పు తప్పదు

కర్రి శివన్నారాయణ, ఇంకొల్లు

అధికారులు కాంట్రాక్టు దారులు కలిసి నిర్మించిన మురుగు కాలవలో చెరువులోకి వర్షపు నీరు చేరదని గ్రామానికి చెందిన కరి శివన్నా రాయ ణ చెబుతున్నారు. పొలాల నుంచి పాత కాలువ ద్వారా వచ్చే వర్షపు నీరు ఇప్పుడు నిర్మించిన 3అడుగుల కాల్వ సామర్థ్యం చాలదని అన్నారు.

రోజురోజుకూ దిగజారుతున్న రైతుల ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేస్తామని మంత్రులు, ఎంఎల్ఎలు, అధికారుల సమక్షంలో అంగీకరించిన కంపెనీలు రకరకాల కొర్రీలు వేస్తూ రైతులను ఇబ్బందులు పెడుతుండటంతో రైతుల్లో రోజు రోజుకు నమ్మకం సన్నగిల్లుతుంది. ఇటీవల నల్లబర్లి పొగాకు సాగు చేసిన రైతులు, రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తా రోకోలు, వినతి పత్రాలు, సదస్సులు, సమావేశాలు తదితర పోరాటాలు చేశారు. నల్లబర్లి పొగాకు కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తూ రైతుల పక్షాన నిలబడ్డారు. దీంతో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల భవనంలో పొగాకు కొనుగోలు కంపెనీలు, పొగాకు బోర్డు అధికారులు, రైతు సంఘం నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చం నాయుడు, ఏలూరు సాంబశివరావు, ఉన్నతాధికారులు కంపెనీలు, పొగాకు రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేయాలని హెచ్చరించారు. పొగాకు చెక్కులు రిజెక్ట్ చేయకుండా రైతులకు గిట్టుబాటు అయ్యేవరకు కొనుగోలు చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శి రాజకుమార్ పర్చూరు నియోజకవర్గంలోని ఉప్పుటూరులో ఎమ్మెల్యే సాంబశివరావు, పలువురు అధికారులతో కలిసి రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొగాకు రైతుల బాధలను ఏకరువు పెట్టారు. సమస్యలను విన్నవించి వేడుకొన్నారు. పొగాకు పండించిన రైతులు ఎవరు అధైర్య పడవద్దు, తాము కొనుగోలు చేపిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని అన్నారు. అయినా నేటి వరకు పొగాకు కంపెనీలు హామీలను పట్టించుకోకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. పొగాకు రంగు బాగోలేదని, నల్లగా ఉందని, ఆకుపచ్చ తగులుతుందని సాకులతో చెక్కులు వెనక్కు వేస్తున్నారు. ఒకటి రెండు కొట్టుడు, అడుగాకులు అసలు వద్దంటున్నారు. టాపు ఆకులు నాణ్యమైనవి మాత్రమే కావాలంటున్నారు. వాటిలో కూడా చెక్కులు తిరగ తొక్కమని వెనక్కు వేస్తూ ఇబ్బందులు పెడుతున్నారు. చెక్కుల కాటాల్లో తరుగు పెడుతున్నారు. ధరలు కోసేస్తున్నారు. దీంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. పొగాకు పంట ఎందుకు సాగు చేశామా? అసలు వ్యవసాయం ఎందుకు చేస్తున్నామా అని మనస్థాపం చెందుతున్నారు.

దిగజారుతున్న పొగాకు రైతుల పరిస్థితి

ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాసనసభ్యులు సమావేశం వేసి హామీ ఇచ్చినప్పటికీ పొగాకు కొనుగోలు కంపెనీల తీరుతో రైతుల పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుంది. పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించని విధంగా తయారైంది. ఉప్పుటూరులో ఉన్నతాధికారులతో సమావేశం వేసిన రోజే వీరన్నపాలెంలో పొగాకు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అది జరిగి మూడు రోజులు అవకముందే దుద్దుకూరులో గడ్డి మందు తాగి మరోకవు రైతు ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. ఈ రెండు ఉదాహరణలు పొగాకు రైతుల పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

వెంటనే కంపెనీలపై చర్యలు చేపట్టాలి

ప్రభుత్వం పొగాకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా కంపెనీలపై చర్యలు చేపట్టాలని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు తలపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, సిహెచ్ గంగయ్య కోరారు. గ్రామాల్లో పొగాకు పండించిన రైతుల పరిస్థితి ఎలా ఉందో ఈ రెండు సంఘటనలే ఉదాహరణని అన్నారు. పొగాకు కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకొని గిట్టుబాటు ధరకు పొగాకు కొనుగోలు చేయకపోతే రైతుల పరిస్థితి భవిష్యత్తులో మరింత దిగజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే ప్రభుత్వమే కొనుగోలుకు రూ.100కోట్లు కేటాయించి మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

టెర్రరిస్టు స్థావరాలను ధ్వంసం చేయాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

పాకిస్తాన్ టెర్రరిస్ట్ స్థావరాలు ధ్వంసం చేసిన భారత జవాన్లకు జెజెలని ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో భారత జవాన్లకు జేజేలు తెలిపారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానుషమని అన్నారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయటం పట్ల దేశ ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చర్చల ద్వారా భారత్, పాకిస్తాన్ సమస్యలు పరిష్కరించి శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అల్లాడి కోటి బాబు, మద్దిరాల రాజేష్, సిహెచ్ ఏలియా, కె కుమార్ జాన్సన్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
ఆదివారం 11 మే 2025

యంత్ర పరికరాలు అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేత

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రైతులకు తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఎస్ఎంఎఎం ద్వారా 2024-25కు ఎంపికైన రైతులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి మేలు చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. రాబోయే సీజన్లో రైతులు ఇబ్బంది పడకుండా కాలువలు అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రైతాంగానికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి పరిధిలోని 112 మంది రైతులకు రూ.44.90లక్షల విలువైన పరికరాలకు రూ.18.43లక్షల రాయితీతో పంపిణీ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి మత్తి భాస్కరరావు, ఆర్డీఓ రామలక్ష్మి, తహశీల్దారు సిహెచ్ పద్మావతి, డిఆర్‌పిఓ కెజిఎ శ్రీనివాసన్, నిజాంపట్నం జడ్పిటిసి నర్రా వెంకటసుబ్బయ్య, రేపల్లె ఎడిఎ ఆర్ విజయబాబు, ఎఒ టి బాలాజీ గంగాధర్ పాల్గొన్నారు.

దేవాలయానికి వచ్చిన విరాళాల వివరాలు చెప్పాలి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల భావనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి (జీర్ణోద్ధరణ) దాతలు స్వచ్ఛందంగా అందించిన విరాళాల వివరాలు దాతలు, ప్రజలకు చెప్పాలని న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు విన్నకోట సత్యప్రసాద్ కోరారు. ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. ఆలయ జీర్ణోద్ధరణకు భక్తులు, దాతల నుండి రూ.కోట్ల విరాళాలు దేవాలయం తరపున ఏర్పడిన కమిటీ వసూలు చేశారని అన్నారు. జీర్ణోద్ధరణ క్రతువు పూర్తయి రెండేళ్ళు అవుతోందని అన్నారు. విరాళాల వివరాలను ఇంతవరకు వెల్లడించలేదని అన్నారు. ఎవరు అడిగినా సమాధానం లేదని అన్నారు. కేవలం దేవాలయ అభివృద్ధికి మాత్రమే దాతలు విరాళాలు ఇచ్చారని, సేకరించిన విరాళాలను దాతల ఉద్దేశ్యానికి వ్యతిరేకంగా వినియోగించిన్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోందని అన్నారు. ఇదే అంశాన్ని తాను దేవాలయ కార్య నిర్వహణ అధికారిని ప్రశ్నించగా విరాళాల సేకరణకు, దేవదాయ శాఖకు, తనకు సంబంధం లేదని, ఒక ప్రైవేటు కమిటీ సేకరించారని అన్నారు. అయితే విరాళాల విషయమై తాను ఏమి చెప్పనవసరం లేదని చెప్పారని అన్నారు. ఆలయ జీర్ణోద్ధరణకు వచ్చిన విరాళాలతో రామానుజ కూటమి నూతన భవనాన్ని నిర్మించి వ్యాపారాలకు అద్దెకిచ్చారని అన్నారు. రామానుజ కూటమి యాత్రి నివాస్ భవన నిర్మాణం ఏ నిధులతో నిర్మించారని ప్రశ్నించారు. ప్రజలు, భక్తుల నుండి సేకరించిన వివరాలు ఎంత మేర వసూలయ్యాయి, దేనికి ఖర్చు పెట్టారనేది బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. వివరాలు సక్రమంగా వెల్లడించకపోతే ప్రజల పక్షాన న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అన్నారు. అందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాల్సి వస్తుందని అన్నారు. విరాళాల అంశంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ మంత్రిని కోరినట్లు తెలిపారు.

భక్తులకు అన్నదానం ఏర్పాట్లు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండపై వేం చేసిఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. నేడు స్వామివారి జయంతి, స్వామివారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు దేవస్థానం ఇఒ ఎం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమం అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు.

ఓ తల్లి కరుణ రసాత్మక వ్యథ

- ఆమెది అంతులేని కథ
- విధి వంచిత బిడ్డలకు 36 ఏళ్లుగా సేవలు
- పాండురంగాపురానికి చెందిన అభాగ్యురాలి కథ

ప్రజాశక్తి - బాపట్ల

విధి వంచిత బిడ్డలకు మూడున్నర దశాబ్దాలుగా సపర్యలు చేస్తున్న ఆ కన్న తల్లిది అంతులేని కథ. బిడ్డల పరిస్థితి చూసి ఆ తల్లి కన్నీరు కార్చని రోజే లేదు. వాళ్ల దయనీయ పరిస్థితిపై కలత చెందని ఘడియే లేదు. అందులో ఒక బిడ్డ పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉండటంతో ఆ తల్లి కంటనీరు ఆగటం లేదు. బిడ్డల పరిస్థితి చూసి తల్లడిల్లి పోతూనే వాళ్ల బాగోగుల కోసం ఆ తల్లి పడుతున్న తపన, ఆరాటం అంతా ఇంతా కాదు. గుండెల్ని పిండేసే ఆ విషాద కథ ఈనెల 11న మదర్స్ డే సందర్భంగా ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక కథనం.

మండలంలో సముద్రతీరానికి అత్యంత చేరువలో పాండురంగాపురంకు చెందిన కుక్కల శ్రీనివాసరెడ్డి, పోతమ్మ దంపతులకు ముగ్గురు బిడ్డలు మతి స్థిమితం లేకుండా పుట్టారు. మూడేళ్ల వ్యవధిలో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది ఆ తల్లి. మొదటి బిడ్డ మతిస్థిమితం లేకుండా పుట్టాడని తెలిసి చలించి పోయింది. ఆ తర్వాత ఏడాదికి మరో బిడ్డకు జన్మనిచ్చింది పోతమ్మ. రెండో బిడ్డ మంచిగా పుడతాడని భావించింది. ఆ బిడ్డ కూడా అదే పరిస్థితి. ఇద్దరు బిడ్డల దీనస్థితి చూసి ఆ తల్లి తీవ్రంగా కుమిలిపోయింది. మూడో ఏడాది మరో బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి ఆ బిడ్డపై ఎంతో ఆశలు పెట్టుకుంది. మళ్లీ మగ బిడ్డ పుట్టాడని సంతోషించింది. మూడో బిడ్డ కూడా మతిస్థిమితం లేకుండా పుట్టాడని తెలిసిన ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. ముగ్గురు బిడ్డల్ని తీసుకొని తిరగని ఆసుపత్రి లేదు. ఎక్కడా చికిత్స జరిగే అవకాశం లేదని తెలిసి ఆ తల్లి పోతమ్మ వెక్కివెక్కి రోదించింది. అప్పటి నుండి ఆ తల్లి బిడ్డల్ని కంటికి రెప్పలా చూసుకోవటమే కాదు వాళ్లకు ఏ బాధ వచ్చినా

మతిస్థిమితం లేని కన్న బిడ్డలతో దీనంగా తల్లి పోతమ్మ

తట్టుకోలేకపోయేది. బిడ్డల దీనస్థితి చూసి కన్నీటి పర్యంతం అవుతూనే మాతృ ప్రేమను ముగ్గురికి సమానంగా పంచుతోంది. వయసుతో పాటు ఆ బిడ్డల మానసిక స్థితిలో మార్పు లేదు. అయితే ఆ తల్లి ప్రేమలో మాత్రం ఎక్కడా తేడా లేదు. మొదటి బిడ్డ పున్నారెడ్డి వయసు 38ఏళ్ళు. రెండో బిడ్డ సత్యనారాయణ రెడ్డి 37ఏళ్ళు. మూడో బిడ్డ అంకిరెడ్డి వయసు 36. ఇందులో మొదటి బిడ్డ పున్నారెడ్డి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం కొంత ఆందోళనకరంగా ఉంది. ఉలుకు పలుకు లేకుండా దీనస్థితిలో పడి ఉన్న ఆ బిడ్డను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెడుతున్నారు. ఆ తల్లి కొచ్చిన ఈ బాధను చూసి గ్రామస్తులు చలించిపోతున్నారు. కూలీనాలీ చేసుకుంటే గాని పూట గడవని బతుకులు అవి. మతిస్థిమితం లేని ముగ్గురు కుమారులతో ఎన్నో ఇబ్బందులు పడి పోషిస్తున్నారు. అయినా ఏ రోజు కూడా బిడ్డలకు ఏ లోటు లేకుండా చూసుకుంటూ వస్తున్నారు. వాళ్లకు ఏం కావాలో నోరారా అడిగే అదృష్టానికి ఆ బిడ్డలు నోసుకోలేదు. ఆ బిడ్డలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఆ తల్లికి తెలుసు. వాళ్ల హావభావాల ఆధారంగా ఆ బిడ్డల అవసరాన్ని తీర్చటంలో ఆ తల్లి నిరంతరం వాళ్ళ కోసం శ్రమిస్తూనే ఉంది. కొండంత విషాదం దాగి ఉన్న తాను బతికున్నంత కాలం బిడ్డల్ని కంటికి రెప్పలా చూసుకుంటానని చెప్తున్న ఆ మాతృ మూర్తి ప్రేమ చెరగిపోని ఒక చిరునామాగా నిలుస్తోంది.

స్తంభాలు మార్చకుండానే రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - కారంచేడు

కరెంటు స్థంభాలను మార్చ కుండా ప్రభుత్వ నిధులతో రోడ్లు వేశారు. మండలంలోని రంగప్ప నాయుడు వారిపాలెంలో రోడ్ల నిర్మాణానికి పల్లె పండుగ నిధులు మంజూరయ్యాయి. దీంతో గ్రామస్తులు రోడ్లు లేని వీధుల్లో రోడ్లు వేస్తాని సంతోషపడ్డారు. అయితే స్థానిక తెలుగుదేశం నాయకుడు అమరనేని సుబ్బారావు ఇంటికి వెళ్లే రోడ్డు మంజూరైంది. అయితే తమ రోడ్డు మధ్యలో స్థంభాలు ఉన్నాయని, వాటిని పక్కకు జరిపి రోడ్డు వేస్తే అందరికి అనుకూలంగా ఉంటుందని సుబ్బారావు కారంచేడు ఏఈ, పర్చూరు ఏడిఈ తదితర విద్యుత్ అధికారులను కలిసి కరెంటు స్థంభాలు మార్చాలని కోరాడు. విద్యుత్ అధికారుల చుట్టూ రెండు నెలలు తిరిగిన ఫలితం లేక పోయింది. దీంతో సమయానుగుణంగా రోడ్డు నిర్మించకపోతే నిధులు వెనక్కి పోతాయనే ఉద్దేశంతో కాంట్రాక్టర్ రోడ్డు మధ్యలో ఉన్న స్థంభాలను అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం పూర్తి చేశాడు. దీంతో అసలు సమస్య మొదలైంది. వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. రోడ్డు లేనప్పుడు ట్రాక్టర్లు వెళ్ళేవని, ఈ రహదారిలో వాహనాలు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని గ్రామస్థులు

మధ్యలో స్థంభం ఉంచి నిర్మించిన రోడ్డు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులు తమ గ్రామం పట్ల నిర్లక్ష్యంగా ఉండటంవల్లనే స్తంభాలు తొలగించకుండా తాత్సారం చేశారని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సుబ్బారావు ప్రజాశక్తి తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్థంభాలు తొలగించి పక్కన స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఇకపై ఇంటి నుంచే బ్యాంకు చెల్లింపులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

డ్వాక్రా మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక యాప్ తీసుకురానుంది, దీని ద్వారా ఇంటి నుంచే రుణాలు, పొదుపు చెల్లించవచ్చు. ఈ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల రుణ చెల్లింపులు సులభతరం అవుతాయి. బ్యాంకులకు వెళ్లే అవసరం తప్పుతుంది. టిడిపి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు భారీగా రుణాలు ఇవ్వడానికి సిద్ధమైంది. సాంకేతికత అందిపుచ్చుకుంటూ ప్రజా పాలన అందిస్తోంది. ప్రభుత్వ సేవలు ప్రజలందరికీ సులువుగా అందుబాటులో ఉండేలా వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజాగా ఏపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు శుభవార్త చెప్పింది. డ్వాక్రా రుణాల చెల్లింపు కోసం గ్రూప్ తరపున ప్రతి నెలా ఒకరు డబ్బులు వసూలు చేసి వాటిని బ్యాంకుల్లో జమ చేస్తుంటారు. ఒక వ్యక్తి పని మానుకుని రోజంతా దీని కోసమే కేటాయించాల్సి వస్తుంది. అలానే స్త్రీనిధి రుణాలు వసూలు చేసిన వాళు బ్యాంకులో నగదు జమ చేయకపోవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం రుణ చెల్లింపు ప్రక్రియను ఆన్ లైన్ చేయాలని భావించింది. దీనిలో భాగంగా డ్వాక్రా రుణ చెల్లింపు యాప్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

శ్యాంసన్ కుటుంబ సభ్యులకు రైతు నేతల పరామర్శ

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని దుద్దుకూరులో గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసిన పొగాకు రైతు శ్యాంసన్ కుటుంబ సభ్యులను రైతు సంఘం నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిపిఐ కంపెనీకి చెందిన ప్రసాద్ అనే ఉద్యోగి ముందు చెక్కులు తొక్కమని తర్వాత చెక్కులు కొనుగోలు చేయటం కుదరదని, పొగాకు బాగోలేదని తెలిపాడని, కనీసం ఆరేడు చెక్కులైన డబ్బులు కోసం కొనుగోలు చేయమంటే చెప్పాడని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి మీటింగ్ వేశారు కదా! కొనుగోలు చేయమని ఏలూరి సాంబశివరావు జిల్లా రాష్ట్రస్థాయి అధికారులు కూడా చెప్పారు కదాని శాంసన్ అడుగగా జిపిఐ కంపెనీ ఉద్యోగి ప్రసాదు సీఎం కాదు, పిఎం మోడీ కాదు వ్యవసాయ శాఖ మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ ఎవరు చెప్పినా తాము కొనుగోలు చేయమని, కొనుగోలు చేసేది ఇంతేనని నిర్లక్ష్య సమాధానం చెప్పారని వాపోయారు. ఏం చేసుకుంటారో చేసుకోండని అన్నాడని తెలిపారు. ఈ విషయాన్ని పరామర్శకు వచ్చిన రైతు సంఘం నాయకులకు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సాంసన్ వైద్య ఖర్చులు మొత్తం జిపిఐ కంపెనీ, ప్రసాద్ భరిచాలని డిమాండ్ చేశారు. పొగాకు కంపెనీలు పొగాకు సాగు చేసిన రైతులను ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, కనీసం గౌరవించడం లేదని తెలిపారు. ప్రభుత్వపరంగా ప్రసాదుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రాంకోటేశ్వరరావు, స్థానిక నాయకులు జరుగును హరిబాబు, మానం హరిబాబు ఉన్నారు.

నూతన రథం లాగుతున్న దృశ్యం

నూతన రథానికి ట్రయల్ రన్

ప్రజాశక్తి - బాపట్ల

ఈనెల 12న జరిగే భావనారాయణ స్వామి రథోత్సవం సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన రథానికి శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు. శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో భావన్నారాయణ స్వామి గాలిగోపురం వద్ద నుండి నూతన రథాన్ని గడియార స్తంభం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. తిరిగి రథాన్ని పట్టణ ప్రజలు మోకుతో లాగి రథశాలకు చేర్చారు. కార్యక్రమంలో దివి వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు ప్రజలు పాల్గొన్నారు.

14 నుంచి ఉత్సవాలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 14 నుండి 19 వరకు మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఇఒ మదమంచి తిమ్మనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 19న 75వేల నుంచి లక్ష మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని, దానికి తగ్గట్లుగా తాగునీరు, భోజనాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక అన్న సత్రాల్లో భక్తులకు అన్నదానం జరుగుతాయని అన్నారు. ఆ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనలతో ఆలయ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రూ.6.80 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. టిటిడి నుండి రూ.3కోట్ల, రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.2కోట్లతో నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. దేవాదాయ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, పర్చూరు, వినుకొండ, కొండేపి, ఒంగోలు శాసనసభ్యులు హాజరవుతారన్నారు. టిటిడి కళ్యాణ మండపం, దామాచర్ల ఆంజనేయులు, సక్కుబా యమ్మ నిర్మించిన వసతి గృహాలు సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 30వేల మందికి రిజిస్టర్ పోస్టుల్లో ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

సైనిక నిధికి రూ.5లక్షల విరాళం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా చీరాల వాసి, యుఎస్‌ఎలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ సైనికుల సహాయ నిధికి రూ.5లక్షల విరాళం అందజేయడం అభినందనీయమని ఎస్‌పి తుషార్ డూడి కొనియాడారు. భారతదేశ సైనికుల సహాయనిధికి అందించాలని కోరుతూ ఐదు లక్షల చెక్‌ను ఎస్‌పి చీరాల ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ద్వారా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భారత సైనికులు దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారన్నారు. వారిని గౌరవించడమే కాదు, ఇలాంటి విపత్కర సమయాల్లో సాయంగా నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన ఎన్‌ఆర్‌ఐకి అభినందనలు తెలిపారు.

11,12 తేదీల్లో మాగుంట పర్యటన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 11, 12 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. 11న సాయంత్రం ఐదు గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 6 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. 12న ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలు ప్రకాశం భవనం ఆవరణలోని మీకోసం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న జిల్లా సమీక్షా మండలి సమావేశం(డిఆర్‌సి)లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు తన కార్యాలయంలో ఎంపీ మాగుంట ప్రజలకు అందుబాటులో ఉంటారు.

20న కార్మిక, కర్షక సమ్మెను విజయవంతం చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో పలువురు నేతల డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక లోకం నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని నారాయణస్వామి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఈనెల 20న నిర్వహిస్తున్నే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు దేశంలోని అన్ని రైతు సంఘాలు సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది అన్ని పంటల ధరలు పడిపోయి రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారన్నారు. ధాన్యాన్ని రూ. 4 వందల తక్కువ ధరకు అమ్ముతున్నారని తెలిపారు. గతంలో క్వింటా రూ.18 వేలు పలికిన మిర్చి ధర ఈ ఏడాది రూ. 9,000 పడిపోయిందన్నారు. బర్లీ పొగాకును కొనే నాధుడే లేరన్నారు. అపరాలు, రొయ్యలు, జీడి పిక్కల ధరలు కంపెనీల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ధరల స్థిరీకరణ నిధిని రద్దు చేయడం వల్ల రైతాంగం ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు కేంద్రం అవలంబిస్తున్న కార్మిక కర్షక విధానాలను ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైనదని తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతి బాబు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల రుణాలను రద్దు చేయాలన్నారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం తేవాలన్నారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె. నాంచార్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విప్లవ రైతు సంఘం నాయకులు భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ పొగాకు, మిర్చి పంటలను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను 200 రోజులకు పొడిగించాలని డిమాండ్ చేశారు. రోజువారి కూలీ రూ. 600 ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధీర్ మాట్లాడుతూ పాల రైతులకు లీటరుకు రూ. 10 ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న 44 చట్టాలను, హక్కులను నిర్వీర్యం చేసి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఐఎఫ్‌టియు నాయకుడు ఆర్.మోహన్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలన్నారు.

మాట్లాడుతున్న చుండూరి రంగరావు

మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్. దామోదర్

నేర పరిశోధనలో

నైపుణ్యం పెంపొందించుకోవాలి

- నిందితులకు శిక్షింపబడితేనే నేరాలు తగ్గుముఖం
- ఎస్‌పి ఎఆర్.దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నేర పరిశోధనలో పోలీస్ అధికారులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌పి దామోదర్ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ల్‌లో నమోదవుతునన్న నమోదవుతున్న కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే దర్యాప్తు అధికారులు నేర స్థలం నుంచి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించాలన్నారు. వాటిని పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం ముఖ్యమని తెలిపారు. దర్యాప్తు అధికారులకు ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై నిపుణులతో శనివవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి దర్యాప్తు అధికారి మంచి నైపుణ్యం కలిగి ఉండాలని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ పై ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. క్రిమినల్ కేసుల్లో పోలీస్ అధికారికి ఏదో ఒక రూపంలో సవాలు ఎదురవుతూనే ఉంటుందని, నేరం జరిగే తీరు ఆధారంగా కొన్ని క్లిష్టతరమైనదిగా, మరికొన్ని సులభతరంగా ఛేదించే విధంగా ఉంటాయన్నారు. నేరం ఏ విధంగా జరిగింది, ఎవరు చేశారు, నేరానికి దారి తీసిన అంశాలు వంటివి తెలుసుకునేందుకు ప్రతి పోలీసు అధికారి సంపూర్ణ నిష్ణాతుడు కావాలన్నారు. నేరం చేసిన నిందితులు ఎట్టి పరిస్థితుల్లో శిక్ష నుంచి తప్పించుకోకూడదని తెలిపారు. నేరస్తుడు నేర స్థలంలో వదిలిన భౌతిక సాక్షాధారాలను సేకరించే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సాక్ష్యాలను సేకరించే విధానం లాంటి అంశాలపై ప్రతి అధికారి మంచి నైపుణ్యం కలిగి ఉండాలనేది శిక్షణా కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. నేర స్థలంలో డిఎన్ఎ, రక్త నమూనాలు, మానవ అవయవాలు, వెంట్రుకలు, నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలలో పాటించాల్సిన అంశాలు, ఆడియో, వీడియో, వివిధ పత్రాలు, భౌతిక సాక్ష్యాధారాలును ఏవిధంగా సేకరించాలి, ప్యాకింగ్, నిల్వ, భద్రపరచడం ,లెటర్ ప్రిపేర్, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదికను పొందే విధానం గురించి మెలకువలు వివరించారు. నిపుణులు తెలియజేసిన అంశాల గురించి, పోలీస్ అధికారులు వారికున్న సందేహాలను నివత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, డిసిఆర్‌బి సిఐ దేవ ప్రభాకర్, ఐటి కోర్ సిఐ సూర్యనారాయణ, మంగళగిరి ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్ నిపుణులు పి.కల్పన, కె.రవికుమార్, కె.శిరీష, పి.కల్పన, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పొగాకు రైతు గోడు..

పొగాకు రైతు గోడు ఇపుడు ఎవరూ వినేపరిస్థితి లేదు. కేంద్రం పరిధిలో ఉన్న పొగాకుకు గిట్టుబాటు ధర వస్తుందా ?లేదా?అని ఆలోచించే అవకాశం కూడా ఇపుడు లేదు. కేంద్రం యావత్తూ ఇపుడు పాక్‌పై యుద్ధం గురించే ఆలోచిస్తున్నారు. అందరి దృష్టి ఇపుడు ఆ యుద్ధంపైనే ఉంది. సోషల్ మీడియాలో పోస్టులు నూటికి నూరుశాతం యుద్ధంపైనే ఉంటున్నాయి. ఈ పరిస్థితిని పొగాకు వ్యాపారులు తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. పోటీలేకుండా పోయింది. వ్యాపారులు సిండికేట్ అయ్యారు. దీంతో సీలింగు ధర కిలో రూ.280కు మించడం లేదు. ఆరంభం నుంచి నేటి వరకూ ఇదే ధర కొనసాగుతుంది. దీన్ని వేలం అంటారా? లేక వ్యాపారుల కూటమి అంటారా?. బాపట్ల జిల్లాలో బర్లీ పొగాకు రైతులు ఆత్మహత్యల బాటపట్టారు. పంటను ప్రోత్సహించిన వ్యాపారులు ఇపుడు దాన్ని కొనడం లేదు.ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో బర్లీ పొగాకు రైతులు ఉన్నారు.

కేంద్రం మాత్రం వదిలేసింది. బర్లీ రైతుల గోడు కేంద్రం వరకూ వెళ్లింది. ఇలా వర్జీనియా. బర్లీ పొగాకు రైతుల గోడు ఎవరూ వినేపరిస్థితి లేదు. పొగాకు బోర్డు ప్రేక్షకపాత్ర పోసిస్తోంది. వ్యాపారుల ఇష్టా రాజ్యమైంది. వేలంలో నిత్యం 25శాతం బేళ్లను తిరస్కరిస్తున్నారు. ఇదొక వ్యూహం. ధరలు పెంచమని అడగకుండా ముందుగా ఏదో రకంగా వెనక్కి పంపితే ఆ విషయం పక్కకుపోతుందనేది వ్యాపారుల ఎత్తుగడ. ఇపుడు ఇదే సఫలీకృతమైంది. ఎందుకంటే అడిగే నాధుడు లేడు. రాష్ట్రమంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ వేలం కేంద్రాలకు వెళ్లినా ఫలితం కనిపించడం లేదు.వ్యాపారులతో మీటింగులు పెడతాం... సిఎం దృష్టికి తీసుకుపోతాం అంటూ అక్కడున్న రైతులకు నాలుగు మాటలు చెప్పి వస్తున్నారు. కనీసం మంత్రిగానీ, ఎమ్మెల్యేలు వెళ్లిన రోజైనా వేలంలో కొంత ధర పెరుగుతుందని భావించినా ఫలితం లేదు. మంత్రి డోలా వీరాంజనేయస్వామి ఒంగోలు కొండపి కేంద్రాలను తనిఖీ చేశారు. ఒక్కరూపాయ ధర పెంచలేదు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బిఎన్.విజయ్‌కుమార్ ఒంగోలులో కేంద్రాలను పరిశీలించారు. ఆరోజూ అదే ధర. వ్యాపారుల సిండికేట్‌గా కొనసాగడమే ఇందుకు కారణం. కేంద్రం గానీ, రాష్ట్రం గానీ ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలోకి దించి వేలంలో వ్యాపారులకు పోటీగా కొనుగోళ్లు చేస్తే తప్ప రైతులకు గిట్టుబాటు ధర వచ్చే మార్గం లేదు. ఆ దిశగా పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జనం దృష్టిఅంతా ఇపుడు భారత్-పాక్ యుద్ధంపైనే ఉంది.యుద్ధం దెబ్బకు ఐపిఎల్‌కూ రేటింగు తగ్గింది. సోషల్‌మీడియాలో యుద్ధంపై పోస్టులదే ఇపుడు అగ్రపీఠంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు అందరిలోనూ ఉత్కంఠ పెరుగుతోంది. కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. పోలీసుశాఖ కూడా ఏదో రూపంలో తనిఖీలు నిర్వహిస్తోంది. జాతీయ రహదారిపై కోరిశపాడు వద్ద ఉన్న హైవేరన్‌వేను సిద్ధంగా ఉంచారు. యుద్ధం చర్చ క్షేత్రస్థాయికి చేరింది.అప్పట్లో యుద్ధం వార్తలు కేవలం రేడియోల్లోనే వినేవాళ్లం. ఇపుడు నేరుగా యుద్ధవిమానాల విన్యాసాలూ వస్తున్నాయి. ఇవే ఇపుడు వైరల్‌గా మారిపోతున్నాయి. ఎవరి ఇష్టం మొచ్చినట్లుగా వారు పోస్టింగులూ పెడుతున్నారు.సవాళ్లు చేస్తున్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయవద్దంటూ ప్రభుత్వం కూడా హెచ్చరికలు చేస్తోంది. అందరూ సంయ మనం పాటించాల్సిన అవసరం కూడా ఉంది. యుద్ధంతో మిగతా విషయాలూ,కీలక ఎజండాలకు కొంత ప్రాధాన్యత తగ్గే అవకాశం కనిపిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి ఆదేశాలు జారీ చేసింది. పేదలు పెద్దఎత్తున వీటికోసం ధరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంకా పింఛను, పక్కాగృహాలకు కొత్తగా ధరఖాస్తులు స్వీకరించడం లేదు. ఆన్‌లైనులో లింకు ఇవ్వలేదు. వీటికోసం పేదలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిఏడాది కావస్తోంది.ఇప్పటి వరకూ పేదలకు ఇచ్చే పథకాలకు కొత్తగా ఎవరికీ అవకాశం ఇవ్వలేదు. ఫలితంగా భర్తలు చనిపోయిన మహిళలకు పింఛను రాలేదు. కనీసం ధరఖాస్తు కూడా పెట్టుకునే పరిస్థితి లేదు. భార్యా భర్తల్లో ఈ పాటికే పెన్షను పొందే వారిలో ఎవరైనా ఒకరు చనిపోతే బతికి ఉన్నవారికి పెన్షన్ పొందే అవకాశం ప్రస్తుతం ఇచ్చారు. ఇది కూడా 2022 నుంచి పెన్షను పొందేవారికి అనుమతి ఇచ్చారు. ఇళ్లస్థలాల కోసం,ఇతర పథకాల కోసం పెద్ద సంఖ్యలో పేదలు ఎదురు చూస్తున్నారు. ఇళ్ల స్థలాలపై ఇచ్చిన హామీ నెరవేరలేదు.